క్లుప్తంగా

రాజన్న జయంతికి ఏర్పాట్లు



మునగపాకలో రాజన్న విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న పార్టీ శ్రేణులు

మునగపాక: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లోని విగ్రహాలను రంగులతో అలంకరించారు. ఇప్పటికే పలు చోట్ల విగ్రహాలను శుభ్రం చేశారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలోని రాజన్న విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నివాళులర్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వై.ఎస్. జయంతి ఘనంగా నిర్వహించాలి..

ఎస్.రాయవరం : మండలంలో దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా మండల కేంద్రానికి చేరుకోవాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గణపర్తిలో సిల్టు తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాయుడు

మునగపాక: గణపర్తి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు పేర్కొన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామంలోని డ్రైనేజీ, కాలువల్లో పేరుకుపోయిన సిల్టు తొలగింపు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డయేరియా సోకకుండా సీజన్‌లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 25 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు హరిచందన

కె.కోటపాడు: కంటి సంబంధిత సమస్యలకు త్వరితగతిన మెరుగైన వైద్యం పొందాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి హరిచందన తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ లెక్కల అర్జున, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినీకుమార్, వందన తదితరులు పాల్గొన్నారు.

14న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మండలంలోని బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భావితరాల మనుగడను, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మానవ జాతి మనుగడకు మొక్కలే ప్రధాన ఆధారమన్నారు.

మరపురాని మహానేత.. వైఎస్సార్

- అన్నదాతల మదిలో ఆయనది చెరగని ముద్ర
- ఖరీఫ్, రబీలకు తాండవ నీరు అందించిన అపర భగీరథుడు

మహానేత జ్ఞాపకాలు పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల హృదయాల్లో ఇప్పటికీ పదిలంగానే ఉన్నాయి. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డికి పాయకరావుపేట నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. రాజీవ్ పల్లె బాట ద్వారా నియోజకవర్గంలో పర్యటించిన ఆయన ఆ సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాండవ, వరాహ నదులపై మినీ బ్యారేజీల నిర్మాణం ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించి అన్నదాతల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారు.



పాయకరావుపేటలో తాండవ నదిపై వైఎస్సార్ హయాంలో నిర్మించిన మినీ బ్యారేజీ

నక్కపల్లి : పాయకరావుపేట ప్రాంతంలో వృత్తి కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న చేనేత కార్మికులకు ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు ద్వారా అండగా నిలిచారు మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి. ఇక్కడి చేనేత కార్మికులకు చేయూతనిచ్చారు. పాయకరావుపేట పట్టణంలో చేనేత కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా రూ.కోటి వ్యయంతో ఫ్యాషన్ టెక్నాలజీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా మహిళలు ఉపాధి పొందేవారు. మహానేత మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఫ్యాషన్ టెక్నాలజీని నిర్వీర్యం చేయడంతో అది కాస్తా మూతపడింది.

మహానేత హయాంలో జరిగిన అభివృద్ధి పనులు..

- పాయకరావుపేటలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు
- ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకునే పేద విద్యార్థుల కోసం పాయకరావుపేటలో ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటు
- తాండవ నదిలో రూ.8 కోట్లతో మినీ బ్యారేజీలు నిర్మించి తాండవ జలాలు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి సాగుకు ఉపయోగపడే విధంగా చర్యలు
- దాదాపు 30 ఏళ్లగా నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న 35 క్యూసెక్కుల తాండవ జలాలను పేట ప్రజలకు అందించారు. - ఖరీఫ్, రబీల్లో రెండు పంటలు పండించే రైతులకు సాగునీటి కష్టాలు తీర్చారు.
- బంగారయ్యపేట, ఉపమాక చందనాడ, సీతంపాలెం, చినతీనార్ల, మంగవరం, గునిపూడి, సత్యవరం గ్రామాలకు సుమారు రూ.8 కోట్ల వ్యయంతో తారురోడ్ల నిర్మాణం
- పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని పాయకరావుపేట వరకు తరలించేందుకు రూ.25 కోట్ల కేటాయింపు
- నక్కపల్లి మండలంలోని జానకయ్యపేటలో పశువుల ఆస్పత్రి.. చినదొడ్డిగల్లులో పీహెచ్‌సీ మంజూరు
- పాయకరావుపేట మండలం మంగవరంలలో పీహెచ్‌సీ మంజూరు
- ఉద్దండపురం వద్ద 97 గ్రామాలకు తాగునీటి ఎద్దడి తీర్చే వాటర్ గ్రిడ్‌కు రూ.36 కోట్లు కేటాయించి ఏలేరు కాలువ నీటిని తరలించేందుకు పైపులైన్ల ఏర్పాటు
- ఎస్. రాయవరం మండలంలో వరహా నది గ్రోయిన్లకు రూ.5 కోట్లతో మరమ్మతులు
- నియోజకవర్గంలో4,700 మంది రైతులకు సుమారు 9 వేల ఎకరాల ప్రభుత్వ భూముల పంపిణీ
- నియోజకవర్గంలో ఇందిరమ్మ పథకం ద్వారా సుమారు 37 వేల ఇళ్ల నిర్మాణం

నియోజకవర్గంలో పోలవరం పరవళ్లు..

ప్రజా ప్రజాప్రస్థానంలోభాగంగా ఈ ప్రాంతంలో పాదయాత్ర చేపట్టిన వై.ఎస్.కు ఈ ప్రాంత రైతులు పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును చేపడతానని హామీ ఇచ్చిన మహా నేత సీఎం కాగానే పోలవరం పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పోలవరం ఎడమ కాలువ కింద పాయకరావుపేట నియోజకవర్గంలో 6,7,8 ప్యాకేజీల కింద వైఎస్సార్ హయాంలోనే పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు కాలువ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి. కాలువలో చేరిన వర్షపు నీటితో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో కాలువను ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా వరి పండించి ఫలాలు అనుభవిస్తున్నారు. ప్రతి ఏటా పోలవరం కాలువలో చేరిన నీటిని ఇంజిన్లతో సుమారు 5 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు.



దాదాపు పూర్తి కావచ్చిన పోలవరం కాలువ

కారణజన్ముడు వైఎస్సార్..



దివంగత నేత వైఎస్సార్ కారణ జన్ముడు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు తపించారు. పేదల కోసం పుట్టిన ఆయన పేదలకు మంచి చేసి అందని దూరాలకు వెళ్లిపోయారు. మహానేత హయాంలోనే నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీరాయి. శాస్వత అభివృద్ధి పనులు చేపట్టారు. మారుమూల గ్రామాలకు తారు రోడ్డు సదుపాయం, రైతుల కోసం పోలవరం కాలువ నిర్మాణం, తాండవ జలాల విడుదల, విద్యార్థుల కోసం ఐటీఐ, హాస్టల్ వంటి సదుపాయాలు కల్పించారు. రాజీవ్ పల్లెబాట ద్వారా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పేదవాడి గుండెల్లో పదిలమే.

\- వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

క్లాత్ బ్యాగులు వినియోగిద్దాం

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఏవీఎన్ మూర్తి కోరారు. మండలంలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే నాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పిల్లలకు క్లాత్ బ్యాగుల వినియోగంపై అవగాహన కల్పించారు. ముందుగా సంధించిత కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. అనంతరం భగవద్గీత శ్లోకాలపై భీశెట్టి లక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను, నిర్వాహకులు యల్లపు సంజీవరావు, నాగలక్ష్మి, ఆడారి సునీత, భీశెట్టి తులసి, మణి, చదరం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, చిన్నారులు

ప్రతిభావంతులకు పురస్కారాలు



డీఈవో వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న ఎస్‌వో సరితాదేవి



ఎస్.రాయవరం మండల విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కోటవురట్ల: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీఆర్టీయూ సముచిత రీతిన సత్కరించింది. అనకాపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని టాపర్స్, హెచ్‌ఎంలను ఘనంగా సత్కరించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ సత్కారాలు చేసి మెమెంటోలు అందజేశారు. అదే విధంగా శత శాతం ఫలితాలు సాధించిన కేజీబీవీ ఎస్‌వో సరితాదేవిని ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో లక్ష్మమ్మ సూచించినట్టు సన్మాన గ్రహీత ఎస్‌వో సరితాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్, మండల అధ్యక్షుడు అబ్దుల్లా, కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం అభినందనీయం..

ఎస్.రాయవరం: మండలాల వారీగా 10వ తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను జిల్లాస్థాయిలో సత్కరించడం అభినందనీయమని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. ఇటీవల టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను అనకాపల్లి డీఈవో ఆదివారం సత్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీను, ఎస్. రాయవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరభద్రరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ వార్షికోత్సవం



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాయకరావుపేట : ఎంఆర్‌పీఎస్ 30వ వార్షికోత్సవం పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. బర్త్ డే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల వాయిద్యాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు, మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ పాయకరావుపేట నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు గంపల సుబ్బారావు, మండల అధ్యక్షుడు కుందూరు కుమార్, నాయకులు సలికే అచ్చిరాజు, వేమగిరి లక్ష్మణ్, కుందూరు రాణా, తుమ్మలపల్లి కుమార్, ముంజులూరి దుర్గాప్రసాద్, ఆరుగుల అప్పలకొండ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణోత్సవం

అనకాపల్లి: గవరపాలెం జగన్నాథస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవార్లకు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వరాహ శివ సూర్యనారాయణ(బుజ్జి) పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారి ని దర్శించుకుని, విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ డైరెక్టర్లు, ఆలయ ఈవో, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

యలమంచిలి రూరల్: రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో 9వ తరగతి విద్యార్థిని బద్దిదర్శినిని అతి కిరాతకంగా హతమార్చిన ప్రేమోన్మాది సురేష్‌ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని భారత విద్యార్థి సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి మైలపల్లి బాలాజీ కోరారు. ఈ ఘటనతో రాష్ట్రంలోని విద్యార్థులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారని, ముఖ్యంగా బాలికలు స్కూళ్లకు వెళ్లాలంటేనే భయపడేలా ఈ హత్య జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. దర్శిని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి బాలాజీ విజ్ఞప్తి చేశారు.

కొత్తూరులో భారీగా కోడి పందాలు

రాంబిల్లి: కొత్తూరులో ఆదివారం భారీ స్థాయిలో కోడి పందాలు జరిగాయి. గ్రామదేవత పండగ సందర్భంగా ఇక్కడ కోడి పందాలు నిర్వహించారు. ఇవి జరిగిన ప్రాంతంలో పేకాటలు, గుల్లాటలు జరిగాయి. దీనిపై సీఐ నర్సింగరావును వివరణ కోరగా.. పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధ్వాన రహదారులతో అవస్థలు




గోతులతో అధ్వానంగా మారిన అన్నవరం రోడ్డు

కోటవురట్ల: గ్రామీణ రహదారులు ప్రస్తుత వర్షాలకు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. అన్నవరం నుంచి వేములపూడి వెళ్లే రహదారి మొత్తం ఛిద్రమైంది. రహదారి అంతా గోతులమయంగా మారడంతో రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే మరింత దారుణంగా తయారవుతున్నాయని, అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

'నూతన చట్టాలపై అవగాహన పెంచాలి'

అనకాపల్లి: భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలు పూర్తి స్థాయిలో అమలుపరిచే ముందు ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయి నుంచి నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. పోలీస్ అధికారులతో పాటు, విద్యాలయాల్లో, వివిధ ప్రజా సంఘాల కార్యక్రమాల్లో నూతన చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నూకాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు



శిథిలావస్థలో నూకాలమ్మ తల్లి ఆలయం

రోలుగుంట: స్థానిక నూకాలమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్మాణం కోసం ఇద్దరు దాతలు లక్ష రూపాయలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఇక్కడ ఆలయం నిర్మించి 80 ఏళ్లపైగా కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ నిర్వహణ, అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలను మునిసబ్ కుటుంబీకులు చూసుకుంటున్నాయి. వీరితోపాటు స్థానికులు అల్లు శ్రీను, కొట్టే రమక్క, బణికల దేవుడు, బోయపాడు శ్రీను కమిటీగా ఏర్పడి ఆలయ పునర్నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు దాతల సాయం తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా స్వర్గీయ మడ్డు రామ్మూర్తినాయుడు తమ్ముడు చిట్టిబాబు, కుమారుడు ప్రసాద్ రూ.50 వేల చొప్పున లక్ష రూపాయలు ఇస్తున్నట్టు ప్రకటించారు. వీరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభ ముహూర్తం మేరకు ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఈ నెల 19న బయటకు తీయడంతోపాటు ఇదే నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. భక్తులు సహాయ సహకారాలు అందించాలని కమిటీ వారు కోరారు.

నేత్రపర్వంగా జగన్నాథుని రథయాత్ర



మునగపాకలో జగన్నాథ స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మునగపాకలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర గ్రామంలోని వీధుల వీదుగా నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి భక్తులు జగన్నాథుడిని దర్శించుకున్నారు. జై గంటలు కొడుతూ తోడపెద్దు సేవలతో ఊరేగించారు. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విల్లూరి జగన్నాథరావు, కాండ్రేగుల జగ్గప్పారావు, కాళ్ల జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, బొడ్డేడ ఈశ్వరరావు, ఆడారి జగ్గారావు, బొడ్డేడ జగ్గారావు, ఆడారి బాపునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సుభద్ర, బలరామ సమేత జగన్నాథుడు

యథేచ్ఛగా ఇసుక, మట్టి తరలింపు

ఎస్.రాయవరం: వీకెండ్ వస్తే చాలు అక్రమ రవాణాదారులు పెట్రేగి పోతున్నారు. ప్రభుత్వం మారి అధికారుల బదిలీల క్రమంలో గ్రావెల్, ఇసుక, మట్టిని జేసీబీలు ఉపయోగించి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. గుడివాడ శివారు కొత్తపోలవరం వద్ద ఆదివారం జేసీబీ ఉపయోగించి గ్రావెల్ తవ్వుకుని తరలించారు. అదే క్రమంలో జేవీపాలెం, పేటసూదిపురం, సర్వసిద్ధి గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. సోమిదేవపల్లి, దార్లపూడి పరిసర ప్రాంతాల్లో వరహా నది గట్ల వద్ద వీలు కుదిరినప్పుడల్లా ఇసుక తరలించుపోతున్నారు. శని, ఆదివారాలు ఈ దందా మరింత జోరుగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించటం లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ మేరకు కొత్తపోలవరం గ్రావెల్ తరలింపుపై అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు.



కొత్తపోలవరం కొండపై గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

ఆశాజనకంగా వేరుశనగ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో వేరుశనగ పంట ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సాగులో భాగంగా వందెకరాల్లో సాగు చేస్తున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలు వేరుశనగ పంటకు మేలు చేశాయని సాగు రైతులు చెబుతున్నారు. వేరుశనగ విత్తు వేసిన నాటి నుంచి వర్షాలు పడుతుండడం పంటకు ప్రయోజనకరంగా ఉందని అంటున్నారు. కొరువాడ, పొతనవలస, వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో వందెకరాల్లో వేసిన పంట పూతదశకు చేరుకుంది. ఈ దశలో పంటకు ఎకరాకు 200 కేజీలు జిప్సం వేసినట్లయితే గింజలో నూనె శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు.



వారాడలో వేరుశనగ పంట